# 'సగటు కాశ్మీరీల వైమనస్యం అసలు సమస్య'



పౌరహక్కులనేత, మానవహక్కుల వేదిక నాయకులు డా॥ కె. బాలగోపాల్‌తో కాశ్మీర్ పరిణామాలపై లైవ్‌న్యూస్ ప్రతినిధి జి. ఆశీర్వాదం జరిపిన ఇంటర్వ్యూ. కాశ్మీర్‌లో అమలవుతున్న నిర్భంధం, సైనిక అణచివేత, రాజకీయ పరిస్థితులపై అధ్యయనం చేసిన నిజనిర్ధారణ కమిటీలో డా॥ కె.బాలగోపాల్ సభ్యులు. కాశ్మీర్‌లోని వివిధ ప్రాంతాలలో నాలుగు సార్లు పర్యటించారు. అక్కడి పౌరహక్కుల సమస్యలపై ప్రత్యేక పరిశోధన జరిపారు. కార్గిల్ సెక్టార్‌లో ఉద్రిక్తత, కాశ్మీర్ సమస్యపై భారత్ పాకిస్తాన్ ప్రభుత్వాల వైఖరి మొదలగు అంశాల్ని డా॥ బాలగోపాల్ ఈ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు.

**కార్గిల్ సెక్టార్‌లో జరుగుతున్న సంఘటనల పర్యవసానంగా ఉభయ దేశాల మధ్య యుద్ధం వచ్చే అవకాశం ఉన్నదా?**

అవకాశం పెద్దగా లేకపోవచ్చు. అణుబాంబులు తయారు చేసుకున్న తరువాత ఇటు ఇండియా అటు పాకిస్తాన్‌లు యుద్ధానికి గతంలో కంటె ఎక్కువగా వెనకాడుతున్నాయి. బాంబులతో బాటు రెండు దేశాలు. అగ్ని, ఘోరి వంటి క్షిపణులు తయారు చేసుకున్నాయి. ఇప్పుడు యుద్ధం ఆషామాషీ వ్యవహారం కాదని రెండు ప్రభుత్వాలకూ తెలుసు.

కాశ్మీర్ ప్రజలలో భారత ప్రభుత్వం పట్ల ఉన్న వైమనస్యాన్ని ఆసరా చేసుకుని కాశ్మీరీ మిలిటెంట్లకు తర్ఫీదు ఇవ్వడం ద్వారానూ 'ముస్లిం' కాశ్మీర్‌ను 'హిందూ' భారతదేశం నుండి విముక్తి చేయడానికి తెగించి ఉరికొచ్చే పాకిస్తానీ, అఫ్ఘాన్ మిలిటెంట్లకు తర్ఫీదు ఇచ్చి ఆయుధాలు అప్పగించి కాశ్మీర్‌లోకి పంపించడం ద్వారానూ, భారతదేశాన్ని ఇబ్బంది పెట్టాలని పాకిస్తాన్ చూస్తుంది.

కాశ్మీర్ ప్రజలలో వైమనస్యం ఎందుకుందో చెప్పకుండా, అసలటువంటిది ఉందని కూడ ఒప్పుకోకుండా, ఇదంతా పాకిస్తాన్ రెచ్చగొడుతున్న ప్రచ్ఛన్న యుద్ధం మాత్రమేనని అంతర్జాతీయంగా గొడవచేసి పాకిస్తాన్‌ను భ్రష్టపట్టించాలని ఇండియా చూస్తున్నది.

అంతకంటే ముందుకు పోవడానికి ఇద్దరూ ఇష్టపడక పోవచ్చు. అణుబాంబులు లేకముందు, సాంప్రదాయక యుద్ధంలో ఇండియాపైన గెలవడం అసాధ్యం అన్న భయం పాకిస్తాన్‌లో ఉండింది. ముఖ్యంగా బంగ్లాదేశ్ యుద్ధంతరువాత అణుబాంబులు వచ్చిన తరువాత పాకిస్తాన్ తన అభిప్రాయం మార్చుకుందేమో తెలీదు గానీ, యుద్ధ భయం ఇరుదేశాలలోనూ పెరిగింది. ముసుగులో గుద్దులాట మాత్రం సాగుతూ ఉంటుంది. దానివల్ల ఎవరి ప్రయోజనాలు వాళ్ళకున్నాయి.. తీవ్రంగా నష్టపోయేది మాత్రం కాశ్మీరీలు.

**ఇప్పుడు భారత్ జరుపుతున్న కాల్పుల కొనసాగింపు ఎంతవరకు సమర్ధనీయం?**

కాశ్మీర్‌లో మిలిటెన్సీ 1989లో కాశ్మీరీలతో మొదలయింది. కాశ్మీర్‌ను భారత ఆక్రమణనుండి విముక్తి చేయాలన్న లక్ష్యంతో అదిమొదలయింది. అయితే దానికొక మత సంబంధమైన కోణం లేకపోలేదు. కాశ్మీర్‌ను ముస్లిం మెజారిటీ ప్రాంతంగా గుర్తిస్తూ, అది పాకిస్తాన్‌లో కలవాలే తప్ప ఇండియాలో ఉండకూడదని నమ్మే అభిప్రాయం ఒకటి ఉంది. నాకు తెలిసినంత వరకు అది కాశ్మీర్‌లో మెజారిటీ అభిప్రాయంకాదు. మెజారిటీని కదిలించేది కాశ్మీరీ జాతీయతే తప్ప మతం కాదు.

అయితే ఈ దృక్పథంతో కాశ్మీర్‌ను 'విముక్తి' చేయడానికి కంకణం కట్టుకున్న ఇస్లామిక్ మిలిటెంట్లు కాశ్మీర్ పోరాటం లో భాగమయి తమ అజెండా అమలు చేయాలని ప్రయత్నం చేయడం త్వరలోనే మొదలు పెట్టారు. వీరిలో కాశ్మీరీల కంటె పాకిస్తానీలు, ఆఫ్ఘాన్‌లు ఎక్కువ. వీరు పాకిస్తాన్ నుండి కాశ్మీర్‌లోకి ప్రవేశిస్తున్నారు. ఇది మొదటి నుండి జరుగుతున్నది. మొదట్లో కాశ్మీర్‌లోయలో పాకిస్తాన్‌కు ఉన్న సరిహద్దుద్వారా ప్రవేశించే వారు. తరువాత జమ్ము ప్రాంతానికి పాకిస్తాన్‌తో ఉన్న సరిహద్దు ద్వారా ప్రవేశించడం మొదలు పెట్టారు. ఇప్పుడు రెండు నెలలుగా కార్గిల్‌కు పాకిస్తాన్‌తో ఉన్న సరిహద్దు ద్వారా ప్రవేశిస్తున్నారు.

అంటే, ఇది ఈ రోజు మొదలైన సమస్యకాదు. వీళ్ళందరినీ చంపేస్తే పరిష్కారమయ్యే సమస్యాకాదు. వచ్చే వాళ్ళు కేవలం పాకిస్తాన్ కిరాయి సైన్యం కాదు. కాశ్మీర్ ప్రజలలో ఉన్న అనంతృప్తిలోకి తమ అజెండా ప్రవేశపెడుతున్న ఇస్లామిక్ మిలిటెంట్లు. కాశ్మీర్ ప్రజలలో ఉన్న అసంతృప్తికి భారత దేశం సమాధానం వెతికేంత వరకూ ఈ సమస్య పోదు.

కాబట్టి, ఇంకా చొరబాటు కొనసాగించడం సాధ్యంకాదు' అన్న అభిప్రాయం వారిలో ఇప్పటికే కలిగి ఉంటుంది. కాబట్టి వాళ్ళనిక క్షేమంగా వెనక్కి వెళ్లిపోనివ్వడం మంచిది. ఇది కాల్పులతో పరిష్కార మయ్యే సమస్యకాదు. దీనికి కాశ్మీరీ ప్రజలలో చాలా లోతుగా నెలకొన్న వైమనస్యంలో మూలం ఉంది.

**కాశ్మీర్‌లో ఇప్పుడు జరుగుతున్న సంఘటనలను వాజ్‌పాయి ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించు కుంటున్నాదా?**

పైన చెప్పినట్టు, చొరబాటు 10 సంవత్సరాలుగా సాగుతూనే ఉంది. కాశ్మీర్ లోయలోని కుప్వారా, బారాముల్లా జిల్లాలలోనూ, జమ్ము ప్రాంతంలోని రాజోలీ, పూంచ్ జిల్లాలలోనూ మొదలయింది. తరువాత జమ్ము ప్రాంతంలోని దొరా జిల్లాకు వ్యాపించింది. ఇప్పుడు లడాఖ్ ప్రాంతంలోని కార్గిల్ జిల్లాకు వ్యాపించింది. అయితే ఇంత ఆర్భాటం మన పాలకులు గతంలో ఎప్పుడూ చేయలేదు. ఏ సార్వభౌమదేశమైనా ఇటువంటి చొరబాటు దార్లను ఎదుర్కొని వెనక్కి తరిమే ప్రయత్నం చేస్తుంది. భారత సైన్యమూ చేసింది. కానీ ఇప్పుడే మొదటిసారిగా విపరీతమైన ఆర్భాటం చేస్తున్నాయి. ఇక్కడే బిజెపి ప్రభుత్వం మీద అనుమానానికి ఆస్కారం ఉంది. రాబోయే ఎన్నికల వాతావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడానికిది వారికొక మంచి అవకాశాన్ని ఇచ్చింది. చాలా నేర్పుగా వాడుకుంటున్నారు.

**జార్జిఫెర్నాండెజ్‌కు ఇతర ప్రభుత్వ అధినేతలు, రక్షణ అధికార్లకు మధ్యభిన్న అభిప్రాయాలు ఉన్నట్లు వారి ప్రకటనల బట్టీ అర్ధమవుతున్నది. దీనికి మూలం ఏమైనా ఉన్నదా?**

ఏమో తెలీదు. తన వ్యక్తిగత అభిప్రాయాలను ప్రభుత్వ అభిప్రాయాలుగా ప్రకటించడం ఫెర్నాండెజ్‌కు అలవాటే. దీని మంచి చెడుల చర్చ మనకు అనవసరం. అయితే, ఈ వరుసలో ఫెర్నాండెజ్ వ్యక్తపరిచిన ఆఖరి అభిప్రాయం, చొరబాటు దారులు తమ ప్రయత్నాన్ని విరమించుకొని ఇంక వెనక్కి వెళ్ళిపోదలచుకుంటే క్షేమంగా వెళ్ళిపోనిచ్చి ఈ ఉదంతానికి ముగింపు పలకాలన్న అభిప్రాయం - సమర్ధించ దగినదే. అంతే తప్ప దీనికి వేరే ముగింపు లేదు.

**చొరబాటుదారులకు పాకిస్తాన్ అన్ని వసతులు కల్పిస్తున్నదని భారత్ చేస్తున్న ఆరోపణలలో వాస్తవాలు ఎంత?**

పాకిస్తాన్ వారికి సహాయ సహకారాలు అందిస్తున్న మాట వాస్తవమే. ఈరోజే కాదు, 1947లో, 1965లో కూడా కాశ్మీర్‌ను 'విముక్తి' చేయడానికి బయలు దేరిన ఇస్లామిక్ మిలిటెంట్లకు పాకిస్తాన్ సహాయం చేసింది; మనం శ్రీలంకలో పోరాడు తున్న ఎల్‌టిటిఇకి చాలా కాలం చేసినట్టు, అంతకు ముందు తూర్పు పాకిస్తాన్ వేర్పాటు వాద సైన్యమైన ముక్తి బాహినికి చేసినట్టు.

కానీ, భారత ప్రభుత్వం ఒప్పుకొనడానికి ఇష్టపడని విషయం ఏమిటంటే, అసలు సమస్య చొరబాటుదారుల ప్రవేశంలోనూ లేదు, వారికి పాకిస్తాన్ ఇస్తున్న చేయూతలోనూ లేదు. చొరబాటు దారులకు కాశ్మీర్‌లోపల ఆశ్రయం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న సగటు కాశ్మీరీల వైమనస్యం అసలు సమస్య. సరిహద్దు దగ్గర భారత సైన్యం ఎదురుదాడిని తప్పించుకోగల చొరబాటుదారులకు కాశ్మీర్ లోయలో దాదాపు ఏ ఇంట్లోనయినా ఆశ్రయం దొరుకుతుంది. ఆ 'సమస్య' ను ఒప్పుకొనడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా లేనన్నాళ్ళు పాకిస్తాన్ మీద పడి ఎంత ఏడ్చినా ప్రయోజనం శూన్యం.

**చొరబాటుదార్లు అంటే ఎవరు, ఏ ఉద్దేశ్యంతో భారత భూభాగంలోనికి చొరబాటు జరపాలనుకొంటున్నారు?**

చొరబాటుదార్లు ఎక్కువగా పాకిస్తానీలు, అఫ్ఘాన్‌లు. పాకిస్తానీలలో కొందరు కాశ్మీరీలు కూడ ఉన్నారు. కానీ పంజాబీలు తదితరులు కూడ ఉన్నారు. వాళ్ళ దృక్కోణాన్ని 'పాన్-ఇస్లామిజం' అంటారు. రాజకీయంగా దీని అర్ధమేమిటంటే ముస్లింలు ముస్లిమేతరుల పాలనలో బతకకూడ

దని. కాబట్టి వాళ్లు ముస్లింలు మైనారిటీలుగా ఉన్న దేశాలలో వేర్పాటువాదాన్ని వనిగట్టుకొని ప్రోత్సహిస్తారు. ఈ పాన్-ఇస్లామిక్ మిలిటెంట్ల అంతర్జాతీయ సంస్థ హర్కత్-ఉల్-అన్సార్. అమెరికా దానిని టెర్రరిస్టు సంస్థగా ప్రకటించిన తరువాత ఆ సంస్థ తన పేరును హర్కత్-ఉల్-ముజాహిదీన్‌గా మార్చుకుంది.

**వారి రాజకీయం సమర్ధనీయమా?**

వారి రాజకీయంలోని లోపం ఏమిటంటే ముస్లింలు తమను తాము ఎప్పుడూ 'ముస్లింలు' గానే భావించుకోవాలనుకోవడం. కార్మికులుగా, రైతులుగా, స్త్రీలుగా, తెలుగు వాళ్ళుగా, వగైరా ప్రజా సమూహాలలో భాగంగా తమను తాము చూసుకో కూడదనుకోవడం.

వారి రాజకీయం సమర్ధనీయమా అనేదానికంటె ముఖ్యం ఏ కాశ్మీర్ ప్రజల పేరిట వారు పని చేస్తున్నారో ఆ ప్రజలు వారి గురించి ఏమనుకుంటున్నారనేది. 'కాశ్మీర్ సమస్య' లో అత్యంత దురదృష్టకరమైన విషయమేమిటంటే కాశ్మీరీల మనో భావాలను అందరూ వాడుకునేవారే తప్ప వాటిని గౌరవించే వాళ్ళెవరూ లేకపోవడం. ఈ చొరబాటు దార్లకు కాశ్మీర్‌లో దాదాపు ఏ యింట్లో నయినా ఆశ్రయం దొరుకుతుందన్నాను. అయితే దాని అర్థం, సగటు కాశ్మీరీలు ఈ చొరబాటు దార్ల పాన్-ఇస్లామిక్ దృక్పథంతో ఏకీభవిస్తారని కాదు. నిజానికి సగటు కాశ్మీరీ ప్రాపంచిక దృక్పథంలో కాశ్మీరీ జాతీయతే ప్రధాన అంశం తప్ప మతం కాదు, వేరే ఏదీకాదు. అయితే జాతీయతా భావంతో భారత రాజ్యం మీద పోరాటం చేస్తున్న కాశ్మీరీలకు, వేరే కోణం నుండి భారత రాజ్యం మీద పోరాటం చేస్తున్న ఇస్లామిక్ మిలిటెంట్లు మిత్రులుగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. అందువల్ల ఒకపక్క వారి ఛాందసత్వా నికి విసుక్కుంటూ కూడ వారికి ఆశ్రయం ఇస్తుంటారు, దానివల్ల వచ్చే నిర్బంధాన్నీ భరిస్తుంటారు.

వాస్తవాధీన రేఖకు ఆవలి వైపున ఉన్న కాశ్మీరీలు భారత్ కలిసి ఉన్న కాశ్మీర్ ప్రాంత ప్రజల కంటే ఏవిధమైన భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నారు.

కాశ్మీరీలలో ఇక్కడా అక్కడా కూడ కాశ్మీరీ జాతీయవాద ప్రభావం చాలా బలంగా ఉంది. పాకిస్తాన్ పాలకులు కూడ ఆ జాతీయ వాద భావన పట్ల అసహనంగానే ప్రవర్తిస్తున్నారు. అయితే భారత దేశంలోని కాశ్మీరీలలో ఉన్నట్టు పాకిస్తాన్‌లోని కాశ్మీరీలలో ప్రస్తుతం సాయుధ మిలిటెన్సీ లేదు. రెండవది, వాస్తవాధీన రేఖకు ఆవలనున్న వారంతా కాశ్మీరీలు కారు. పూంచీలు మొదలయిన అనేక జాతుల వారున్నారు. కాశ్మీరీలలో ఉన్నట్టు

కాశ్మీర్ సమస్యను మొట్టమొదట అంతర్జాతీయం చేసింది భారతదేశమే, పాకిస్తాన్ కాదు. భారత దేశమే 1947 డిసెంబర్ 31న కాశ్మీర్‌లోకి పాకిస్తాన్ చొరబడిందనీ, దురాక్రమణ చేసిందనీ ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది. అంతే కాదు, కాశ్మీర్ ప్రజలు కోరు కుంటున్న ప్లెబిసైట్ లేక రెఫరెండమ్‌ను అంతర్జాతీయ వేదికల మీదికి తీసుకు పోయిందికూడ మన ప్రభుత్వమే. పైన చెప్పిన ఫిర్యాదులోనే, కాశ్మీర్‌లో శాంతి నెలకొన్న వెంటనే ప్లెబిసైట్ నిర్వహించి కాశ్మీర్ ప్రజలకు స్వయం నిర్ణయాధికారం కల్పిస్తామని భారత ప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చింది.

స్వయంనిర్ణయాధికార కాంక్ష ఆ జాతులన్నిటిలోనూ బలంగా లేదు.

**అంతర్జాతీయ వేదికపై కాశ్మీర్ సమస్యను పరిష్కరించుకోవాలనే పాకిస్తాన్ వాదన సమర్ధనీయమా?**

కాశ్మీర్ సమస్యను మొట్టమొదట అంతర్జాతీయం చేసింది భారతదేశమే, పాకిస్తాన్ కాదు. భారత దేశమే 1947 డిసెంబర్ 31న కాశ్మీర్‌లోకి పాకిస్తాన్ చొరబడిందనీ, దురాక్రమణ చేసిందనీ ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది. అంతే కాదు, కాశ్మీర్ ప్రజలు కోరు కుంటున్న ప్లెబిసైట్ లేక రెఫరెండమ్‌ను అంతర్జాతీయ వేదికల మీదికి తీసుకు పోయిందికూడ మన ప్రభుత్వమే. పైన చెప్పిన ఫిర్యాదులోనే, కాశ్మీర్‌లో శాంతి నెలకొన్న వెంటనే ప్లెబిసైట్ నిర్వహించి (అదికూడ ఐక్య రాజ్యసమితి ఆధ్వర్యంలో) కాశ్మీర్ ప్రజలకు స్వయం నిర్ణయాధికారం కల్పిస్తామని భారత ప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చింది. ఆ హామీనే కాశ్మీరీ పోరాటకారులు, పాకిస్తాన్ ప్రభుత్వమూ, చొరబాటుదారు మిలిటెంట్లూ పదే పదే జ్ఞాపకం చేస్తున్నారు. ఆ హామీని భారత ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడమే 'కాశ్మీర్ సమస్య'. దానిని ఐక్యరాజ్య సమితిలో లేవదీయాలని పాకిస్తాన్ ప్రయత్నం చేయడంలో తప్పేముంది?

**అంతర్జాతీయ పోలీసు పాత్ర వహిస్తున్న అమెరికా కాశ్మీర్‌పై ఏ వైఖరి నవలంభిస్తుంది?**

అన్ని విషయాలలోలాగ ఈ విషయంలో కూడ అమెరికా వైఖరి ఒకటే. తన అధికారాన్ని కాపాడుకోవడం. రష్యాతో ఉన్న అధికార పోరులో బాగంగా గతంలో అమెరికా పాకిస్తాన్‌ను సమర్ధించేది. రష్యా బారత్‌ను సమర్ధించింది. అంతే తప్ప కాశ్మీరీ ప్రజల న్యాయమైన కోరికలతోగానీ వారి స్వయం నిర్ణయాధికారంతో గానీ ఎవరికీ ప్రమేయం లేదు. ఇప్పుడు రష్యా బలహీనపడింది. అమెరికా ఒకపక్క పాకిస్తాన్‌కు రాజకీయ మద్దతు కొనసాగిస్తూ మరొక పక్క పాకిస్తాన్ కంటె అనేక రెట్లు పెద్ద మార్కెట్ ఉన్న ఇండియాను దూరం చేసుకోకూడదని చూస్తోంది. ఈ ఆరాటంలో కాశ్మీరీల హక్కులకు చోటెక్కడా?

**కాశ్మీర్ ప్రజల యొక్క అభీష్టానికి వ్యతిరేకంగా ఇప్పుడు కాశ్మీర్‌లో యుద్ధం జరుగుతున్నదనే భావన వాస్తవమేనా?**

తమ సమస్య భారత - పాకిస్తాన్‌ల సమస్యగా మారడం పట్ల కాశ్మీరీలలో తీవ్ర నిరసన ఉంది. 'వీళ్ళెవరు మా భూభాగాన్ని పంచుకొని దానికోసం యుద్ధం చేసుకోవడానికి?' అని వాళ్ళు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు. "కాశ్మీర్ సమస్యను భారత -పాకిస్తాన్‌లు సిమ్లా ఒప్పందం స్ఫూర్తితో ద్వైపాక్షికంగా పరిష్క రించుకోవాలి" అని భారత ప్రభుత్వము, మన పత్రికలు తరచుగా ప్రకటిస్తుం టాయి. ఆ ప్రకటనలు చదివినప్పుడల్లా కాశ్మీరీలు - "మా సమస్యను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవడానికి మీరెవరు?" అని అడుగుతారు.

కార్గిల్‌ది మరీ దయనీయమైన పరిస్థితి. కార్గిల్ ప్రజలకు ఇటు ఇండియాతో గానీ అటుపాకిస్తాన్‌తో



గానీ పెద్దగా అనుబంధం లేదు. కార్గిల్ ప్రజలలో ఎక్కువభాగం ముస్లింలు. అయితే వారు షియా శాఖకు చెందిన వారు. సున్నీ ఇస్లాంను అధికార మతంగా స్వీకరించిన పాకిస్తాన్ పట్ల వారికి పెద్దగా ప్రేమ లేదు. ఇక భారతదేశం మాటకొస్తే మొత్తంగా ఆ ప్రాంత ప్రజలందరిలాగ కార్గిల్ ప్రజలకు కూడ ఈ దేశం మీద పెద్దగా ప్రేమలేదు. ఉండాలని చెప్పడానికి ఈ యాభై ఏళ్లలో మనం వారికి చేసింది కూడా ఏమీలేదు. అయితే ఇప్పుడు కార్గిల్ సరిహద్దు దగ్గర జరుగుతున్న యుద్ధం వల్ల వారే తీవ్రంగా నష్టపోతున్నారు. తమకు పెద్దగా సంబంధం లేని ఈ గొడవలో తామెందుకు ప్రాణాలు పోగొట్టుకోవాలనే నిరసనే వారి ప్రధాన మానసిక భావన అయి ఉంటుంది. రెండేళ్ళ కింద పాకిస్తాన్ సైన్యం కార్గిల్ పట్టణంపైన పెద్దెత్తున గుండ్లు కురిపించినప్పుడు కార్గిల్ వాసులంతా అటుపాకిస్తాన్‌కూ ఇటు తమను కాపాడలేకపోయిన భారతసైన్యాన్నీ సమానంగా తిట్టారు. ఇప్పుడు అంతకంటె భిన్నంగా ఆలోచిస్తుంటారని అనుకోవడానికి ఆధారాలేమీ లేవు.

**కాశ్మీర్ సమస్యకు పరిష్కారం ఏ విధంగా సాధ్యమవుతుంది?**

రెండు దేశాలలోనూ ఉన్న కాశ్మీర్‌లో భారత పాకిస్తాన్ ప్రభుత్వాలు కలిసి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో రహస్య ఓటింగ్ ద్వారా ప్లెబిసైట్ నిర్వహించడం అన్నిటికంటె సరయిన పరిష్కారం. ఆ ప్లెబిసైట్‌లో కేవలం భారత్‌లో కలుస్తారా? పాకిస్తాన్‌లో కలుస్తారా? అన్న రెండు హక్కులే కాక స్వతంత్ర కాశ్మీర్‌ను కోరుకుంటారా? అనే మూడవ అంశాన్ని కూడ చేర్చాలి. ప్రాంతాలవారీగా లెక్కబెట్టి ఆయా ప్రాంతాలను భారత్‌లో గానీ పాకిస్తాన్‌లోగానీ కలపాలి. స్వతంత్రంగా ఉండేదాన్ని ఎక్కు వోట్లు వచ్చే ప్రాంతాన్ని స్వతంత్ర కాశ్మీర్‌గా ఇరుదేశాలూ గుర్తించాలి.

ఇది దీర్ఘకాల పరిష్కారం. తక్షణం మాత్రం పరిష్కార మార్గాన్ని వెతకడానికి త్రైపాక్షిక చర్చలు జరగాలన్న ప్రతిపాదన కాశ్మీర్‌లో అధికారులు పెడుతున్నారు. అంటే భారత ప్రభుత్వం, పాకిస్తాన్ ప్రభుత్వం, కాశ్మీర్ ప్రతినిధులు (ఇరుదేశాలలోని కాశ్మీరీలు ఈ చర్చల కోసం ఎన్నుకునే ప్రతినిధి వర్గం) కూర్చొని సమాన ప్రాతిపదిక మీద చర్చించాలి.

ఇది జరగాలంటే, జమ్ము'కాశ్మీర్ భారతదేశంలో అవిభాజ్య భాగం అన్న మొండి వైఖరిని మన ప్రభుత్వం వదులు కోవాలి. దానికోసం కృషి చేయడం ఈ దేశంలోని ప్రజాస్వామ్య వాదులందరి కర్తవ్యం.